సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.20,100
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20,100, కనిష్టంగా రూ.3,500, సరాసరిన రూ.14 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.7
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.5 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.4°/13.3°
జిల్లా పరిధిలో శనివారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

గ్రామాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ చేతన్ పిలుపు



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన డీఈఓ కృష్ణప్పతో కలిసి మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో న్యూట్రి గార్డెన్, వంటగది, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు రక్షిత తాగునీరు అందజేయాలన్నారు. న్యూట్రి గార్డెన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి వన సంరక్షణ బాధ్యతలను అప్పగించాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ ద్వారా పాఠశాలలో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. అలాగే స్వచ్ఛాంధ్రా లక్ష్య సాధనలో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. పేరుకు పోయిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. చెత్త కాగితాలు, వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కాగితాలను పూర్తిగా తొలగించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, హెచ్‌ఎం రమామణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రూపశ్రీ సత్తా

- స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం



మెడల్ చూపుతున్న రూపశ్రీ

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి రూపశ్రీ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటింది. మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకుంది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రూపశ్రీ జాతీయ స్థాయిలో రాణించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ పద్మావతి, పీడీ రోజా అన్నారు. రూపశ్రీ స్ఫూర్తితో గురుకుల పాఠశాలకు చెందిన మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళామణి.. పోషకలేమి



- సమతుల ఆహారం తీసుకోని మహిళలు
- పోషకాహారమే వండుతున్నా తినడంలో మాత్రం వెనుకబాటు
- వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు
- 'ఎన్‌ఎస్‌ఐ' పరిశీలనలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇంటిల్లిపాదికీ మంచి ఆహారం వండిపెట్టే ఇల్లాలు.. తను మాత్రం పోషకాహారం తీసుకోవడంలో వెనుకబడిపోతోంది. భర్త, పిల్లలకు రుచికరమైన, బలమైన ఆహారం వండిపెట్టే ఆమె..తాను తినడంలో కాస్త వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. ఎన్‌ఎస్‌ఐ (న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) ప్రతినిధులు జిల్లాలో తాజాగా చేసిన పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కేవలం 26 శాతం మహిళలే సరిపడా పౌష్టికాహారం తీసుకుంటున్నట్టు తేలింది. ఏరోజు ఏ వంట చేయాలో అంతా తన చేతిలోనే ఉన్నా తినేటప్పటికి రకరకాల కారణాలతో శరీరానికి కావాల్సిన సమతుల ఆహారం అందడం లేదు. అందుకే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో పురుషుల కంటే ఎక్కువమంది మహిళలే ఉన్నారని తేలింది. ఉమ్మడి జిల్లాలో పౌష్టికాహారం తీసుకోక చాలామంది మహిళలు రక్తహీనత బారిన పడుతున్నారు.

కూరగాయలు మాత్రం..
రోజూ కూరగాయలు తీసుకునే వాళ్లలో మహిళల సంఖ్య పురుషుల కంటే కాస్త ఎక్కువగా ఉంది. బీన్స్, చిక్కుళ్లు, క్యాబేజీ, క్యారెట్ వంటి కూరగాయలు రోజూ తీసుకునే మహిళలు 24.6 శాతం మంది ఉన్నారు. పురుషుల విషయానికి వస్తే 19.6 శాతం మంది మాత్రమే ఉండటం గమనార్హం. అదే చికెన్ లేదా మటన్ రోజూ తినేవారిలో పురుషులు 1.4 శాతం ఉండగా, మహిళల్లో ఈ సంఖ్య కేవలం 0.5 శాతం ఉంది. వారానికోసారి మాంసం తినే వారి పరంగా మహిళలు 64.2 శాతం ఉండగా, పురుషులు 71 శాతం ఉన్నట్టు తేలింది. కోడిగుడ్లు తినే విషయంలో మహిళలే కాస్త ముందంజలో ఉన్నారు. రోజూ గుడ్లు తినేవారిలో 5.4 శాతం మంది మహిళలు, 3.5 శాతం పురుషులు ఉన్నారు. మొత్తం మీద రకరకాల పోషకాహారం తినేవారిలో పురుషులే ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

వేధిస్తున్న రక్తహీనత..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు 56 శాతం ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అవగాహన లేక సమతుల ఆహారం తీసుకోలేకపోతున్నారు. రుతుక్రమం, గర్భం దాల్చడం వంటి కారణాల పరంగా ఎక్కువ పోషకాహారం తీసుకోవాల్సి ఉన్నా, గ్రామీణ ప్రాంత మహిళల్లో అంత అవగాహన లేదు. ఏ కూరగాయల్లో ఏముంటుంది, ఏ ఆకుకూరలు ఎప్పుడు తినాలి వంటి విషయం తెలీక రక్తహీనత బారిన పడుతున్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి



ప్రస్తుత రోజుల్లో గర్భం దాల్చిన వారు తక్కువ బరువుతో ఉంటున్నారు. గర్భ నిర్ధారణ అయ్యాక మొదటి మూడు నెలలు వాంతులతో తక్కువ ఆహారం తీసుకుంటుంటారు. ఇటువంటి సమయంలో తక్కువ మోతాదులోనే పౌష్టికాహారం తీసుకోవాలి. ఆకుకూరలు, బఠానీ, చిక్కి, పాలు, పెరుగు, తక్కువ మోతాదులో నాన్‌వెజ్ తినాలి. గర్భధారణ సమయంలో 10 కేజీల వరకు బరువు పెరిగేలా ప్రణాళిక చేసుకోవాలి.
– డాక్టర్ షంషాద్ బేగం, గైనకాలజిస్టు

వివిధ ఆహార పదార్థాలు తీసుకునే వారి శాతమిలా..

ఆహారం	మహిళలు (రోజువారీ)	మహిళలు (వారానికి)	పురుషులు (రోజువారీ)	పురుషులు (వారానికి)
కూరగాయలు	24.6	68.9	19.6	74.3
ఆకుకూరలు	11.9	64.3	12.9	75.7
పండ్లు	9.3	37.8	8.2	53.1
గుడ్లు	5.4	68.4	3.5	76.4
చేపలు	1.5	38.5	1.5	48.8
చికెన్/మటన్	0.5	64.2	1.4	71.0
చికెన్/మటన్/చేపలు	1.7	69.5	2.4	75.8
వేపుడు ఆహారం	3.9	29.4	2.5	36.1

17న కదిరిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కదిరి అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 17న కదిరిలో రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతివారం ఒక రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 17న కదిరి ఆర్డీఓ కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చేతన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజల తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

తపశ్య గానం.. సమ్మోహనం



కచేరీ నిర్వహిస్తున్న రంజని శంతనగోపాలన్ తపశ్య బృందం

ప్రశాంతి నిలయం: దేవదేవుళ్లను కీర్తిస్తూ విదుషీ శ్రీరంజని తపశ్య నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను సమ్మోహనభరితులను చేసింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రశాంతి నిలయంలో చేపట్టిన అతిరుద్ర మహాయాగం రెండోరోజూ కొనసాగింది. చెన్నైకి చెందిన శ్రీనివాస్ శర్మ నేతృత్వంలోని రుత్వికుల బృందం ఉదయం గణపతి ప్రార్థనతో ప్రారంభించి మహాన్యాస పారాయణం, షోడశ ఉపచార పూజ, రుద్రపారాయణం, రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. వేదపఠనంతో రుత్వికులు యజ్ఞ క్రతువులు నిర్వహించారు. సాయంత్రం కర్మార్చనం, అష్టావధాన సేవ నిర్వహించారు. పుదిచ్చేరి యూనివర్సిటీ సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ రాధాకృష్ణన్ అతి రుద్రమహాయజ్ఞం విశిష్టతను వివరించారు. అనంతరం విదుషీ శ్రీరంజని శంతనగోపాలన్ తపశ్య బృందం సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి స్వరాలతో దేవదేవుళ్లను కీర్తిస్తూ సాగిన కచేరీతో భక్తులు మైమరచిపోయారు.

ఆలస్యం.. అయ్యవార్ల ఆగ్రహం

- అస్తవ్యస్తంగా క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- ప్రభుత్వ తీరును తప్పుపట్టిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు



పెనుకొండలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ: క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణలో టీచర్లకు చుక్కలు కనిపించాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా శనివారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. ఉదయం తాము పని చేస్తున్న పాఠశాలలకు వెళ్లిన టీచర్లు.. 11.45 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇళ్లకు పంపారు. 12 గంటల నుంచి కాంప్లెక్స్ స్కూళ్లకు బయలుదేరారు. 25–30 కిలోమీటర్ల దూరంలో ఉండే కాంప్లెక్స్ స్కూళ్లకు వెళ్లేందుకు అయ్యవార్లు నానా తంటాలు పడ్డారు. మరీ ముఖ్యంగా మహిళా టీచర్లు రవాణా సదుపాయం లేక నరక యాతన అనుభవించారు.

అటెండెన్స్ యాప్‌లాక్
వాస్తవానికి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలుంటాయని షెడ్యూలు విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు పని చేస్తున్న పాఠశాలలో (ఇన్‌టైమ్) అటెండెన్స్ వేయాలని, మధ్యాహ్నం 12.45 నుంచి 1.30 గంటలలోపు క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో (ఇన్‌టైమ్), అక్కడే సాయంత్రం 5 గంటల నుంచి (అవుట్‌టైమ్) వేయాల్సి ఉంటుందని ప్రకటించారు. అయితే 5.30 గంటల వరకు అటెండెన్స్ పడకుండా యాప్‌లో లాక్ చేయడంతో టీచర్లు బెంబేలెత్తిపోయారు. జబ్బులతో బాధపడుతున్న ఉపాధ్యాయుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై పెనుకొండలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని తూర్పారబట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కాడిశెట్టి శ్రీనివాసులు, రమేష్, నరేష్, కృష్ణానాయక్, హసీనాబేగం పాల్గొన్నారు.

తడక ఉత్సవం.. భక్తి పారవశ్యం



ఆలయంపై అలంకరించిన తడక

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం మండలం చెంద్రాయునిపల్లి సమీపంలో అటవీ ప్రాంతంలో వెలసిన చెన్నకేశవ స్వామి తడక ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఏటా మాఘమాసంలో మూడో శనివారం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే శనివారం తరుగు వంశీయులు, పూజారుల ఉపవాస దీక్షలతో అటవీ ప్రాంతంలో దొరికే వెదురుతో అల్లిన తడకను తీసుకువచ్చి ఆలయం పైభాగాన కప్పారు. ఉత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. చెన్నేకేశవస్వామిని దర్శించుకుని తరించారు.



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

పల్లె రాక.. భక్తుల కాక
ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తడకోత్సవానికి రావడంతో పోలీసులు హడావిడి చేశారు. ఎమ్మెల్యే పూజల్లో ఉన్నంత వరకూ ఆలయం వద్దకు భక్తులు వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు గంటన్నర పాటు రోడ్డు మార్గాన్ని మూసి వేయడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే వెళ్లిపోయాక... భక్తుల వాహనాలు అనుమతించారు. అప్పటికే ప్రధాన రోడ్డుపై వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. దేవుడి వద్ద కూడా ప్రొటోకాల్ ఏమిటంటూ జనం పల్లెతీరును తూర్పారబట్టారు.

డయాలసిస్ రోగులపై పచ్చ పగ



ఈ చిత్రంలోని మహిళ పేరు పద్మ. పెనుకొండ మండలం తురకలాపట్నం స్వగ్రామం. ఎనిమిదేళ్లగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పద్మ వైద్యుల సూచన మేరకు.. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకుంటోంది. ఇందుకోసం 50 కి.మీ దూరంలోని హిందూపురం ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. గతంలో వైఎస్సార్ సీపీ సర్కార్ డయాలసిస్ బాధితులను 108 వాహనం ద్వారా ఆస్పత్రులకు తీసుకువెళ్లి...తిరిగి ఇంటికి చేర్చేది. కానీ కూటమి ప్రభుత్వం డయాలసిస్ చేయించుకునే వారికి 108 ద్వారా రవాణా సౌకర్యాన్ని రద్దు చేసింది. దీంతో పద్మ ఆస్పత్రికి వచ్చి వెళ్లేందుకు ఆటోపై ఆధారపడుతోంది. ఇందుకోసం నెలకు సుమారుగా రూ.10 వేలు ఖర్చు చేస్తోంది. ఇక ఆస్పత్రిలో మందులు అందుబాటులో లేక నెలకు రూ.6 వేలు వెచ్చించి బయట కొంటోంది. ప్రభుత్వం రూ.10 వేల పింఛన్ ఇచ్చినా అవి సరిపోక అతికష్టమ్మీద కూలి పనులకు వెళ్తోంది. రవాణా సౌకర్యం లేక పద్మలా ఇబ్బంది పడుతున్న వారు జిల్లాలో వందల మంది ఉన్నారు.

108 సేవలను రద్దు చేసిన కూటమి సర్కార్

- పింఛన్ డబ్బుకు మించి అధికంగా ఖర్చులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

చిలమత్తూరు: డయాలసిస్ రోగులపై కూటమి సర్కార్ కత్తి గట్టింది. కిడ్నీలు పనిచేయక.. ఏ పనీ చేసే వీలులేక అల్లాడిపోతున్న అభాగ్యులకు అండగా నిలవాల్సింది పోయి కీడు తలపెట్టింది. ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు, మందులు తదితర విషయాలు పక్కన పెడితే కనీసం వారిని ఆస్పత్రి వరకూ చేర్చే 108 సేవలనూ రద్దు చేసింది. దీంతో వారానికి రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన రోగులు ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రికి రాలేక అష్టకష్టాలు పడుతున్నారు.

హిందూపురంలో యూనిట్‌లోనే 160 మంది
హిందూపురంలోని జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని నెఫ్రోప్లస్ సంస్థ నిర్వహిస్తోంది. రెండు పాజిటివ్, 20 నెగిటివ్ బెడ్లు ఉన్నాయి. రోజుకు 60 నుంచి 65 మందికి డయాలసిస్ చేస్తున్నారు. డయాలసిస్ యూనిట్‌లో హిందూపురం , మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాలకు చెందిన 160 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం డయాలసిస్ రోగులను ఆస్పత్రికి చేర్చేందుకు గతంలో ఉన్న 108 సేవలను రద్దు చేసింది. దీంతో రోగులు ప్రైవేటు వాహనాలు ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి రవాణా సౌకర్యం సరిగా లేక ఒకేసారి రానుపోను కలిసి ఆటో మాట్లాడుకుంటున్నారు. దీంతో ఒకసారి ఆస్పత్రికి రావాలంటే రవాణా ఖర్చే కనీసంగా రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. ఇలా ఆరోగ్య పరిస్థితిని బట్టి ఒక్కొక్కరికి మందులు, రవాణా ఖర్చులు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు అవుతోంది.



హిందూపురం ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న వారు

వేధిస్తున్న మందుల కొరత
కూటమి సర్కార్ డయాలసిస్ రోగులకు మందులను సరఫరా చేయలేక చేతులెత్తేసింది. కీలకమైన మందులు ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో రోగులు వాటిని బయట కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో నెలకు మందుల ఖర్చే రూ.5 వేలు వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని రకాల మందులను అందివ్వాలని కోరుతున్నారు.

పింఛన్ సరిపోవడం లేదు



నేను ఏడేళ్లగా డయాలసిస్ చేయించుకుంటున్నా. హిందూపురం ఆస్పత్రిలో డయాలసిస్ మాత్రమే చేస్తున్నారు. మందులు మాత్రం బయట కొనుక్కోవాలని చెబుతున్నారు. ఇందుకు నెలకు రూ. 5 వేలు ఖర్చవుతోంది. దీనికి తోడు ఆస్పత్రికి వచ్చి వెళ్లేందుకు భారీ మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. వచ్చే పింఛన్ సొమ్ము వాటికే సరిపోతోంది. ఏ పనీ చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్న నా లాంటి వారికి ప్రభుత్వం రవాణా ఖర్చులైనా అదనంగా ఇచ్చి ఆదుకోవాలి. ఇందుకోసం పింఛన్ మొత్తం పెంచాలి.
– గోపాల్, కిరికెర, హిందూపురం

క్లుప్తంగా

నిందితునికి రిమాండ్

పెనుకొండ: చోరీ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పెనుకొండలోని నారాయణమ్మ కాలనీ సమీపాన నాగార్జునుడు అనే ఉపాధ్యాయుడి ఇంటిలో 15 రోజుల క్రితం చోరీ జరిగింది. 47 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈ కేసులో నిందితుడైన అనంతపురానికి చెందిన సోహైల్‌ను పెనుకొండ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు రికవరీ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా.. మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

హిందూపురం అర్బన్: పట్టణంలోని ఓ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. టీచర్స్‌కాలనీలో నివాసముంటున్న పశుసంవర్ధకశాఖ విశ్రాంత ఉద్యోగి శివప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల ఎనిమిదో తేదీన కుటుంబంతో సహా బెంగళూరుకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి తిరిగి రాక ఇంటికి రాగా.. అప్పటికే తలుపులు తీసి ఉన్నాయి. లోనికెళ్లి చూడగా బీరువాలో భద్రపరచిన 230 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు కనిపించలేదు. వెంటనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితుడు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీం వచ్చి పరిశీలించింది. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో సీఐ జనార్దన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించి నగదు దోపిడీ

హిందూపురం అర్బన్: పట్టణంలో పట్టపగలు ఓ వ్యక్తిని బెదిరించి నగదు దోపిడీ చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. హౌసింగ్‌బోర్డులో ఓ వ్యక్తి శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఇంటి నుంచి సరుకుల కోసం దుకాణం వద్దకు వెళ్తుండగా కొందరు వ్యక్తులు అటకాయించి బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.9వేల నగదును లాక్కుని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదుతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి అనుమానితులుగా నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హిందూపురం మండలం తూముకుంట వద్ద ఇటీవల ట్రాక్టర్‌ను ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు కొన ఊపిరితో పడి ఉన్నాడు. అయితే అతన్ని ఆస్పత్రికి తరలించే ధైర్యం ఎవరూ చేయలేదు. పోలీసులు వచ్చేసరికి 45 నిమిషాలు గడిచిపోయింది. ఇక ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే అతనూ చనిపోయాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలిస్తే పోలీస్ స్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందేమోనని చాలా మందిలో అపోహ ఉంది. కానీ రోడ్డు ప్రమాద క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే గుడ్ సమరిటన్‌గా ప్రభుత్వం గుర్తిస్తుంది. ప్రశంసాపత్రం, ప్రోత్సాహక నగదు అందిస్తుంది.



రండి... ప్రాణం కాపాడుదాం

- మానవత్వం చాటుకుందాం..
- క్షతగాత్రులను ఆస్పత్రులకు చేరుద్దాం
- ప్రాణాలు కాపాడినందుకు ప్రోత్సాహకం
- మార్చి నుంచి రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం

హిందూపురం అర్బన్: ప్రమాదాలు తరచూ జాతీయ రహదారుల్లోని ప్రధాన కూడళ్లు, మలుపుల వద్ద జరుగుతున్నాయి. ప్రమాదాల సమయంలో ఎవరైనా గాయపడితే తమకేమీ పట్టనట్లు చాలా మంది వ్యవహరిస్తున్నారు. ఇది ఎంతో బాధాకరం. ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం తీసుకొచ్చింది. ప్రమాదంలో గాయ పడిన వారికి అండగా నిలిచేవారికి తగిన ప్రోత్సాహకం అందజేస్తోంది. సాయం చేసిన వారిపై కేసులు కానీ, ఇతర ఇబ్బందులు కానీ ఉండబోవని చట్టంలో చేర్చింది. గుడ్ సమర్థియన్‌గా గుర్తించడమే కాకుండా రూ.5 వేలు ఉన్న నగదు ప్రోత్సాహకాన్ని రూ.25వేలకు పెంచింది. ప్రశంసాపత్రం కూడా అందిస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో 45వేల ఆటోలు, విద్యాసంస్థలకు చెందిన బస్సులు 1800, గూడ్స్ క్యారేజీలు 12,500, మోటార్ క్యాబ్స్ 5,200, ఇతర వాహనాలు 3,520 వరకు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 14 మంది మృత్యువాత పడ్డారు. మరో 27 మంది క్షతగాత్రులయ్యారు.

గోల్డెన్ అవర్ ఎంతో కీలకం..

ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో మొదటి గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారు. కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని గంటలోపు సమీపంలోని ఏదైనా ఆస్పత్రికి తీసుకెళ్తే ప్రాణాలు కాపాడేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. దీంతో సాయం చేసే వారి ఎంపికకు జిల్లా కమిటీ ఉంది. కమిటీలో కలెక్టర్, ఇద్దరు ఎస్పీలు, డీఎంహెచ్ఓ, డీటీసీ సభ్యులుగా ఉంటారు.

నగదు రహిత వైద్యం

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాధితులకు నగదు రహిత వైద్యం అందించే పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం ప్రకారం ప్రమాదం జరిగిన 24 గంటల్లో బాధితులకు గాయాల తీవ్రతను బట్టి రూ.1.50 లక్షలు లేదా ఏడు రోజుల ఆస్పత్రి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ప్రమాద సమాచారన్ని పోలీసులకు తెలియజేసిన తరువాతే వైద్య ఖర్చు ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గత నెల 9న జరిగిన ఓ సమావేశంలో వెల్లడించారు. ఇప్పటికే పంజాబ్, పాండిచ్చేరి, అసోమ్, హర్యానాలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నామని.. ఇక దేశ మంతా మార్చి నెల నుంచి అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించారు.

బాధితులకు సాయమందించాలి



జిరుగుతు

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. నిబంధనలు విస్మరించి ప్రయాణాలు చేయడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల మరణించిన వారిలో యువకులు ఎక్కువగా ఉండటం బాధాకరం. ప్రమాద సమయంలో మానవత్వంతో బాధితులకు సాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

– కె.వి.మహేష్, డీఎస్పీ, హిందూపురం

యువరైతు ఆత్మహత్య



చంద్రశేఖర్ (ఫైల్)

తనకల్లు: అప్పులు యువ రైతును బలిగొన్నాయి. పూలకుంటపల్లికి చెందిన ఈశ్వరప్ప కుమారుడు చంద్రశేఖర్ (32)కు ఐదు ఎకరాలు పొలం ఉంది. అందులో రెండు బోర్లు వేసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంటల కోసం తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. మూడేళ్లుగా పంటలు చేతి కందకపోవడంతో నష్టాలు వచ్చాయి. ఆరు నెలల క్రితం ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు ఓ వైపు.. ట్రాక్టర్ కంతులు ఎలా చెల్లించాలోనన్న ఆందోళన మరోవైపు వెంటాడుతుండేది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చంద్రశేఖర్‌కు భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: రజాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. 2025–26 సంవత్సరానికి బీఆర్ఏజీ సెట్–2025 ప్రవేశ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ మీడియంలో ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 40, ఎంపీసీలో 40 సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 93916 39001 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి

పుట్టపర్తి టౌన్: పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జూమ్ ద్వారా నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, హత్యలు, చోరీలు తదితర కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నిందితుల అరెస్ట్ అయిన కేసుల్లో చార్జ్‌షీట్ త్వరగా దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై విచారణ జరిపి పరిష్కారం చూపాలన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టాలని.. సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని సూచించారు. ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టి.. అక్కడ ఉన్న సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రోజూ విజుబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక శక్తుల ఆట కట్టించాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేసి పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రతి ఒక్కరూ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణను ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు, డీపీఓ సిబ్బంది, ఏఆర్ పోలీసులు శుభ్రం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉండడంతో పాటు ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రతి నెలా మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఆర్ఐ మహేష్, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్‌తో పాటు డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వక్తలు తెలిపారు. శనివారం పుట్టపర్తిలో ఉన్న ఆర్టీసీ డిపో ఆవరణలో జిల్లాలో అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్, పర్సనల్ అకౌంట్ సూపర్‌వైజర్లు, అసోసియేషన్ సభ్యులతో రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ రత్న, ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డి, ప్రజారవాణాధికారి మధుసూదన్, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం 21 మందికి డ్రైవర్లకు ఉత్తమ అవార్డులు అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపాటి ప్రమాదానికి కూడా కారకులు కాకుండా 30 ఏళ్లకు పైగా డ్రైవింగ్ వృత్తిలో కొనసాగుతూ వచ్చిన కొంతమంది డ్రైవర్ల అంకితాభావాన్ని కొనియాడారు.

కందుల కొనుగోలులో రాజకీయం

రొద్దం: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక అధికారులంతా ఆ పార్టీ నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నారు. నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఇలా అన్నింటిలోనూ కూటమి పార్టీల నేతలు చెప్పినట్లే వ్యవహరిస్తున్నారు. చివరకు రైతులకూ రాజకీయం అంటగట్టారు. టీడీపీ మద్దతుదారులైన రైతుల నుంచే కందులు కొనుగోలు చేస్తూ వివాదానికి తెరతీశారు.

కొందరికే సమాచారం ఇచ్చి...

కందుల కొనుగోళ్లకు ప్రభుత్వం రొద్దం కేంద్రం ఏర్పాటు చేసింది. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ద్వారా రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తోంది. శనివారం కందులు కొనుగోలుకు సిద్ధమైన అధికారులు కేవలం టీడీపీ మద్దతుదారులైన రైతులకే ముందస్తు సమాచారం ఇచ్చారు. కందులు తీసుకువచ్చేందుకు అవసరమైన సంచులనూ కొందరికే అందజేసి కొనుగోళ్లు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా రైతులు తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదంటూ ఆందోళనకు దిగారు. పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. రైతులకూ రాజకీయాలు ముడిపెట్టడం సబబుకాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. రైతుల ఆందోళనతో వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగింది. అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. పార్టీలకు అతీతంగా కందులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులే సొంతంగా సంచులు సమకూర్చుకుంటే అందుకు సంచికి రూ.25 చొప్పున చెల్లించాలి కోరారు. అనంతరం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులకు సర్దిచెప్పడంతో వివాదం ముగిసింది. ఆందోళనలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి, బూదిపల్లి రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రొద్దంలో కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

జనసేన కార్యకర్త ఇంటిపై దౌర్జన్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలో జనసేన కార్యకర్త ఇంటిపై టీడీపీ నాయకుడు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డికాలనీ ఎల్–4లో జనసేన కార్యకర్త శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు రేకుల షెడ్డులో హోటల్ పెట్టుకుని జీవిస్తున్నారు. శనివారం టీడీపీ నాయకుడు వీరన్న, అతని అనుచరులు గోపాల్, నరసింహులు వెళ్లి ఈ స్థలం తమదంటూ షెడ్డు ఖాళీ చేయాలని బెదిరించాడు. వారు ఒప్పుకోకపోవడంతో టీవీ, ఫ్రిడ్జ్ ఇతర సామగ్రిని బయటకు విసిరేసి.. బండరాళ్లు వేసి పైకప్పు ధ్వంసం చేశాడు. బాధితులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అడ్డుకున్నారు. రెండేళ్ల కిందట తనకిచ్చిన స్థలంలో షెడ్డు వేసుకున్నానని బాధితుడు శ్రీనివాసులు తెలిపాడు. అయితే వీరన్న తన స్థలమంటూ బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించాడు. న్యాయం కోసం కోర్టును సైతం ఆశ్రయించానని చెప్పాడు. అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకుడు వీరన్న, గోపాల్, నరసింహులుపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



జనసేన కార్యకర్త ఇంట్లోని వస్తువులను బయటపడేసిన దృశ్యం

వడ్డీ వ్యాపారుల వేధింపులపై కేసు

గార్లదిన్నె: అధిక వడ్డీల కోసం మహిళను వేధిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శనివారం మీడియాకు వెల్లడించారు. కోటంక గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ అనే మహిళ తన పెళ్లికి ముందు అనంతపురంలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తుండేది. రెండేళ్ల క్రితం అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన మణికుమార్ వద్ద అవసరాల నిమిత్తం వారానికి నూటికి రూ.10 వడ్డీతో రూ.1.50 లక్షలు అప్పు తీసుకుంది. తన బంగారు ఆభరణాలు అమ్మి అసలు, వడ్డీ కలిపి రూ.3లక్షలు చెల్లించింది. పెళ్లయిన తర్వాత భర్త సురేష్‌రెడ్డిని బెదిరించి అప్పు ఇంకా తీరలేదని గత ఏడాది జూలైలో రూ.5.30లక్షలకు ప్రాంసరీ నోటు రాయించుకున్నారు. అంతేకాదు బాండ్ పేపర్ మీద సంతకం చేయించుకున్నారు. అప్పటి నుంచి డబ్బు కోసం వేధిస్తూనే ఉన్నారు. స్వగ్రామం కోటంకకు వెళ్లినా అక్కడకూ కొంతమంది మహిళలు వెళ్లి అప్పు తీర్చాలంటూ కుళ్లాయమ్మను బెదిరించారు. వడ్డీ వ్యాపారి మణికుమార్, అతని భార్య మణి, తల్లి కొత్తమ్మ నుంచి ప్రాణహాని ఉందని కుళ్లాయమ్మ గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆ ముగ్గురిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

గాయపడిన యువకుడి మృతి

పెద్దవడుగూరు/ గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు మండలం కదిరంపల్లికి చెందిన నరేష్ (32) ఈ నెల 12న పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గం మధ్యలో అడవిపందుల గుంపు అడ్డు వచ్చింది. దీంతో అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నరేష్‌ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

ఒంటరి వృద్ధులే టార్గెట్

- కుదిరితే చోరీ.. లేకుంటే హత్య
- కసాయిని అరెస్ట్ చేసిన పోలీసులు
- బంగారు నగలు, నగదు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న అనంతపురం ఎస్పీ జగదీష్

అనంతపురం: ఒంటరిగా నివసిస్తున్న వృద్ధులే టార్గెట్. రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడడం.. అవసరమైతే హత్యకు తెగబడడం. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న ఓ కసాయిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ పి.జగదీష్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో పొమ్మల సావిత్రి (63) సొంతింటిలో ఒంటరిగా నివసిస్తోంది. ఈమె భర్త అటవీశాఖలో ఉద్యోగ విరమణ చేసిన కొన్నాళ్లకు చనిపోయారు. ఈమెకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. వేరుగా కాపురం ఉంటున్నారు. సావిత్రి తన భర్త పెన్షన్ సొమ్ముతో ఒంటరిగా నివసిస్తోంది. ఈ క్రమంలో గత జనవరి నెల ఆరో తేదీన ఆమె ఇంటిలోనే హత్యకు గురైంది. పదునైన ఆయుధంతో గొంతుకోసి చంపేసిన ఆనవాళ్లు ఉండడంతో పాటు మెడలోని ఉండాల్సిన రెండు బంగారు చైన్లు, సెల్‌ఫోన్ కనిపించలేదు. కుమారుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేర స్థలంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ల ద్వారా ఆధారాలు సేకరించారు. రక్త సంబంధీకులు, ఇరుగు పొరుగు వారిని పోలీసులు విచారణ చేశారు. అనంతరం మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి.. సీసీ కెమెరాలు ఫుటేజీలు పరిశీలించి అనంతపురం పాతూరు నీరుగంటివీధికి చెందిన షేక్ అన్సర్ అలియాస్ చీమిడోడు అలియాస్ నాకులు అలియాస్ చాబూసాను నిందితుడిగా గుర్తించారు.

రెక్కీ నిర్వహించి.. హత్య చేసి..

షేక్ అన్సర్ వెల్డింగ్ వర్కర్. ఇతడు తాగుడు, వ్యభిచారం, తదితర చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. వ్యసనాలు తీర్చుకునేందుకు అప్పులు చేశాడు. అయితే తిరిగి చెల్లించడానికి తగినంత ఆదాయం లేకపోవడం.. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరిగిపోవడంతో డబ్బు కోసం తప్పుడు మార్గం ఎంచుకున్నాడు. ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుల్ని లక్ష్యంగా చేసుకుని.. వారి వద్ద నుంచి విలువైన ఆభరణాలు, నగదు కాజేయాలని అనుకున్నాడు. ఇందులో భాగంగా రెక్కీ నిర్వహించిన తర్వాత జనవరి ఆరో తేదీన టీచర్స్ కాలనీలో టూలెట్ బోర్డు ఉన్న సావిత్రి ఇంటికి వెళ్లాడు. తనకు ఇల్లు బాడుగకు కావాలని వివరాలు అడిగిన తర్వాత తాగునీరు అడిగాడు. ఆమె లోనికి వెళ్లగానే అన్సర్ తన వెంట తెచ్చుకున్న స్టిక్కర్ బ్లేడ్‌తో గొంతు కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు చైను, 16 గ్రాముల పగడాల బంగారు చైను, రెడ్‌మీ సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. ఈ క్రమంలో శనివారం చెరువుకట్ట వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.సాయినాథ్, సీసీఎస్ సీఐ జయపాల్‌రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల తొమ్మిదో తేదీన అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని ఓ ఇంట్లో కూడా షేక్ అన్సర్ చోరీకి పాల్పడ్డాడు.రూ.34,500 చోరీ నగదును నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదింపులో శ్రమించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.